క్లుప్తంగా

నోట్ పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేస్తున్న నాయకులు

తుర్కయంజాల్: టెస్కాబ్ వైస్ చైర్మన్ కొత్త కుర్మ సత్తయ్య జన్మదినాన్ని పురస్కరించుకొని సోమవారం తుర్కయంజాల్‌లోని జెడ్పీ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. దాదాపు 300 మంది చిన్నారులకు అందజేసి అనంతరం వారితో కలిసి కొత్తకుర్మ కార్తీక్, తిలక్ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నిరంజన్‌రెడ్డి, శంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యానికి పోషకాహారం

కౌన్సిలర్ కొత్తకుర్మ మంగమ్మ



అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల ఎత్తు, బరువు కొలుస్తున్న సిబ్బంది

తుర్కయంజాల్: చిన్నారులకు పోషకాహారం అందించాలని తల్లిదండ్రులకు స్థానిక కౌన్సిలర్ కొత్తకుర్మ మంగమ్మ సూచించారు. సోమవారం తుర్కయంజాల్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ మేతరి స్వప్న ఆధ్వర్యంలో నిర్వహించిన బరువు, ఎత్తు మేళాకు ఆమె హాజరయ్యారు. ఈ సందర్భగా ఆమె మాట్లాడుతూ.. పోషకాహార లోపంతో పిల్లలో ఎదుగుదల లోపిస్తుందని, వయసుకు తగ్గట్లుగా బరువు, ఎత్తు పెరగరని గుర్తు చేశారు. తల్లిదండ్రులు పిల్లల పెంపకం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీకి వచ్చే పిల్లల ఎత్తు, బరువుల కొలిశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కల్యాణి తదితరలు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

అబ్దుల్లాపూర్‌మెట్: ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మంగళవారం అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో పర్యటించనున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొత్త ప్రభాకర్‌గౌడ్ తెలిపారు. పర్యటనలో భాగంగా అబ్దుల్లాపూర్‌మెట్, బాటసింగారం, ఇనాంగూడ, లష్కర్‌గూడ, కవాడిపల్లి, తారామతిపేట, గౌరెల్లి, కుత్బుల్లాపూర్ గ్రామాల్లో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారన్నారు. మండల పరిధిలో మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొనాలని ఆయన కోరారు.

ఎస్‌ఐకి సత్కారం



శాలువాతో సన్మానిస్తున్న నాయకులు

ఆమనగల్లు: స్థానిక ఎస్‌ఐ శ్రీనివాసులును కాంగ్రెస్ పార్టీ ఆమనగల్లు మండల నాయకులు సత్కరించారు. ఎస్‌ఐగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఆయనని స్థానిక నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో నాయకులు జగన్, కృష్ణనాయక్, సురేశ్‌నాయక్, అలీం, సురేశ్‌ప్రసాద్, శ్రీరాములు, మైసయ్య, కరీం, నాజర్, మహేశ్, అశోక్, రామకృష్ణ, శేఖర్‌గౌడ్, సురేశ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

రూ.10.05 లక్షలకు తైబజారు వేలం

ఆమనగల్లు: మున్సిపాలిటీ 2024–25 సంవత్సరానికి తైబజారును రూ.10.05 లక్షలకు వేలంలో పట్టణానికి చెందిన తాళ్ల జగన్ దక్కించుకున్నారు. పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో సోమవారం మున్సిపాలిటీ తైబజారును మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, కమిషనర్ వసంతల ఆధ్వర్యంలో తైబజారు వేలం నిర్వహించారు. ఇందులో 24 మంది టెండర్లు వేసి పాల్గొన్నారు. పట్టణానికి చెందిన జగన్ అత్యధికంగా రూ.10.05 లక్షల పాడి దక్కించుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దుర్గయ్య, కౌన్సిలర్లు లక్ష్మణ్, విజయ్‌కృష్ణ, చెన్నకేశవులు, విక్రంరెడ్డి, శ్రీకాంత్‌సింగ్, శ్రీశైలంయాదవ్, శ్రీధర్, మున్సిపాలిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

తలకొండపల్లి: మండల పరిధిలోని పడకల్‌కు చెందిన జంగయ్య(59) అనారోగ్యంతో సోమవారం మృతిచెందారు. ఉప్పల చారిటబుల్ చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. ఈ మేరకు రూ.మూడు వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్, పెంటయ్య, ఎల్లయ్య, నరసింహ పాల్గొన్నారు.

శునకాల స్వైర విహారం

- దాడిలో మూగజీవాల మృత్యువాత
- వరుస ఘటనలతో రైతుల ఆందోళన



మంగళిగడ్డ తండాలో దూడ కళేబరం వద్ద విషాదంలో రైతు

యాచారం: వీధి కుక్కల వీరంగానికి రైతులు ఆందోళన చెందుతున్నారు. రాత్రి వ్యవసాయ పొలం వద్ద కట్టేసిన దూడలపై దాడి చేసి మట్టుబెట్టాయి. తెల్లవారుజామున రైతు పొలం వద్దకు వెళ్లే సరికే రక్తం మడుగులో మృతిచెందిన మూగజీవాలను చూసి బోరున విలపించాడు. విషాద సంఘటన మండలంలోని కుర్మిద్ద అనుబంధ గ్రామమైన మంగళిగడ్డతండాలో చోటు చేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. తండాకు చెందిన రత్నావత్ సేవ్య ఆదివారం రాత్రి తన వ్యవసాయ పొలం వద్ద పాడి పశువులు, దూడలను కట్టేశారు. సోమవారం ఉదయం పాలు పీతకడానికని పొలం వద్దకు వెళ్లారు. అక్కడ రెండు దూడలను చంపి పీక్కుతింటున్న కుక్కలను చూసి ఆవేదన చెందారు. వెంటనే తేరుకొని రత్నావత్ సేవ్య కుక్కలను తరిమేస్తుండగా అతనిపై సైతం దాడికి యత్నించాయి. గట్టిగా ప్రతిఘటించగా వెళ్లి పోయాయి. దూడల మృతితో దాదాపు రూ.20 వేలు నష్టపోయామని బాధిత రైతు విలపించారు. వాటి మృతితో పాడి పశువులు ఎలా పాలిస్తాయని విచారం వ్యక్తం చేశారు.

హైనా అంటూ అనుమానం!

వీధి కుక్కల దాడుల్లో పక్షం రోజుల్లోనే 7 దూడలు మృతి చెందడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ పొలాల వద్ద కట్టేసిన దూడలను వరుస బెట్టి శునకాలు చంపేయడంతో రైతుల్లో భయాందోళన మొదలైంది. ఇటీవల మంగళగడ్డ తండా సమీపంలోనే ఉన్న కందుకూరు మండలం సార్లరావులపల్లి అనుబంధ గ్రామమైన పోతుబండతండాలో విస్లావత్ రాములుకు చెందిన రెండు దూడలను, విస్లావత్ రాజుకు చెందిన ఒక దూడను, నేనావత్ మహేందర్‌కు చెందిన ఒక దూడ, నేనావత్ లక్ష్మణ్‌కు చెందిన ఒక దూడను వీధి కుక్కలు మట్టుబెట్టాయి. యాచారం–కందుకూర్ మండలాల సరిహద్దులో ఉన్న మంగళిగడ్డ తండా, పోతుబండతండాలు అటవీప్రాంతం సమీపంలోనే ఉన్నాయి. దీంతో వరుస దాడులకు వీధి కుక్కలా.. లేక హైనా అనే అనుమానాలు రైతుల్లో వ్యక్తమవుతున్నాయి. గతంలో ఇదే మాదిరిగా హైనాలు దూడలపై దాడులు చేసి చంపేసిన దాఖలాలు ఉన్నాయి.

పరిహారం ఇవ్వాలి



గ్రామ పరిసరాల్లో వీధి కుక్కల సంచారం అధికమైంది. నిత్యం వ్యవసాయ పొలాల వద్ద రైతులు శునకాలతో పోరు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. వీధి కుక్కల నియంత్రణ కోసం పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలి. అటవీ అధికారులు బాధితులకు పరిహారం ఇవ్వాలి.

–యాదయ్యచారి, ఎంపీటీసీ మాజీసభ్యుడు, కుర్మిద్ద

ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకోవాలి

ఎంపీపీ కొప్పు సుకన్య



మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీపీ సుకన్య

యాచారం: గురుకుల పాఠశాలలో విద్యార్థినులు ఉన్నత లక్ష్యం ఎంచుకొని చదువుకోవాలని ఎంపీపీ కొప్పు సుకన్య సూచించారు. మండల కేంద్రంలో ఉన్న గురుకుల పాఠశాల, కళాశాలను సోమవారం ఆమె సందర్శించారు. విద్యార్థినులకు అందించే భోజనంపై ఆరా తీశారు. విద్యార్థి దశ ఎంతో విలువైందని, చక్కగా సద్వినియోగం చేసుకుంటే భవిష్యత్‌లో మంచి ఉద్యోగాలు సాధించే అవకాశం ఉంటుందని తెలిపారు. మంచి బోధన, మెరుగైన విద్యను అందించే విషయంలో రాజీపడొద్దని ఉపాధ్యాయులకు ఆమె సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి ఉన్నారు.

రథయాత్రకు సన్నాహక సమావేశం



రథయాత్ర పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

ఆమనగల్లు: పట్టణంలో ఈ నెల 12న ఇరవై వేల మందితో పూరీ జగన్నాథ రథయాత్ర నిర్వహిస్తున్నట్లు ఆ రథయాత్ర నిర్వహణ వ్యవస్థాపక ప్రముఖ్ పాపిశెట్టి రాము, కన్వీనర్ తల్లోజు వెంకటయ్య, శోభాయాత్ర ప్రముఖ్ ఎంగలి బాలకృష్ణ పేర్కొన్నారు. నగరంలోని కూకట్‌పల్లి ఇస్కాన్ దేవాలయం సహకారంతో నిర్వహించే రథయాత్రకు భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పట్టణంలోని హనుమాన్ ఆలయంలో సోమవారం జగన్నాథ రథయాత్ర సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఆమనగల్లు, కడ్తాల, మాడ్గుల, తలకొండపల్లి, వెల్దండ మండలాలకు చెందిన భక్తులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రథయాత్రకు సంబంధించి కరపత్రాలు, వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రథయాత్ర నిర్వాహకులు అంజయ్య, మోహన్‌రెడ్డి, భద్రయ్య, శ్రీనివాస్‌రెడ్డి, మాధవాచారి, కృష్ణయ్య, మనోహర్, లోహిత్‌రెడ్డి, శ్రీశైలం, వంశీ, టిల్లుయాదవ్, భరత్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు రైతుభరోసాపై అభిప్రాయ సేకరణ

పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి



తలకొండపల్లి: రైతుభరోసా పథకాన్ని ఎలా అమలు చేయాలనే అంశంపై రైతులు, ప్రజల నుంచి అభిప్రాయ సేకరణ చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని వెంకటాపూర్ గేట్ వద్ద వెంకటేశ్వర ఫంక్షన్ హాల్‌లో మధ్యాహ్నం సహకార సంఘం ఆధ్వర్యంలో రైతు భరోసా పథకంపై అభిప్రాయ సేకరణ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సింగిల్‌విండో కార్యాలయంలో విలేకరులతో సోమవారం కేశవరెడ్డి మాట్లాడారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటున్నారని చెప్పారు. సింగిల్‌విండో డైరెక్టర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులు అధిక సంఖ్యలో హాజరై రైతు భరోసా పథకంపై సూచనలు తెలపాలని కోరారు.

సబితారెడ్డి దిష్టిబొమ్మ దహనం



మహేశ్వరంలో ఎమ్మెల్యేకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కందుకూరు: మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని ప్రచారం కావడంతో సోమవారం మహేశ్వరంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు బంగారుగళ్ల లాజర్, సీనియర్ నాయకుడు కాకి ఈశ్వర్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో ఆమె దిష్టిబొమ్మ దహనం చేశారు. సబితారెడ్డి కాంగ్రెస్ పార్టీలోకి రావద్దని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సునీతఅంధ్యానాయక్, నాయకులు రఘుపతి, కృష్ణనాయక్, పాండునాయక్, కొమురయ్య, వెంకటేశ్, జంగయ్య, రాములు, విజయ్‌సూర్య, రాకేశ్, శ్రీను, శివ, శేఖర్‌రెడ్డి, లింగారెడ్డి పాల్గొన్నారు.

కారకులపై చర్యలు తీసుకోండి

ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనంపై బీఆర్‌ఎస్ నాయకుల ఫిర్యాదు



ఠాణాలో ఫిర్యాదు చేస్తున్న నాయకులు

కందుకూరు: మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి పార్టీ మారుతున్నారనే అసత్య ప్రచారంతో ఆమె దిష్టిబొమ్మను దహనం చేసిన కాంగ్రెస్ నాయకులపై చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ నాయకులు కోరారు. బీఆర్‌ఎస్ మహేశ్వరం గ్రామ అధ్యక్షుడు డి.కృష్ణయాదవ్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు సోమవారం స్థానిక పీఎస్‌లో పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. అనవసరంగా పార్టీ మారుతున్నారనే ప్రచారం చేస్తూ సబితారెడ్డి వ్యక్తిత్వాన్ని కించపరిచేలా వ్యవహరిస్తూ ఆమె దిష్టిబొమ్మను దహనం చేయడం హేయమైన చర్య అన్నారు. అందుకు కారకులపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని కోరామన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు సయ్యద్ ఆదిల్‌అలీ, నవీన్, వాసుబాబు, ప్రభాకర్, సుధీర్‌గౌడ్ పాల్గొన్నారు.

వసతుల కల్పనకు కృషి

ఇబ్రహీంపట్నం ఎంపీపీ కృపేశ్



పోచారంలో డ్రైనేజీ పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ కృపేశ్

ఇబ్రహీంపట్నం రూరల్: గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు నిరంతరం కృషి చేశామని ఇబ్రహీంపట్నం ఎంపీపీ కృపేశ్ అన్నారు. సోమవారం మండలంలోని పోచారం గ్రామంలోని ఇందిరమ్మ కాలనీలో రూ.ఆరు లక్షలతో భూగర్భ డ్రైనేజీ పనులు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మండలాన్ని గత ఐదేళ్లుగా అభివృద్ధి పథంలో నడిపించామన్నారు. అన్ని గ్రామాలకు సమానంగా నిధులు కేటాయించామన్నారు. ఎక్కడ చూసిన సీసీ రోడ్లు, విద్యుద్దీపాలు, డ్రైనేజీ సమస్యలు లేకుండా చేశామని గుర్తు చేశారు. సేవ చేయడానికి ప్రజలు అవకాశం కల్పించారని తప్పకుండా వారి నమ్మకాన్ని నిలబెట్టానని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ భగీరథసాగర్, నాయకులు లింగం, శ్రీకాంత్, అమర్‌నాథ్‌అప్ప, రమేశ్, బాలయ్య, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యను పరిష్కరించండి



ఏఈ నరేందర్‌కు వినతిపత్రం అందజేసిన సాలార్‌పూర్‌వాసులు

కడ్తాల్: మండల పరిధిలోని సాలార్‌పూర్ గ్రామంలో తరచూ విద్యుత్ సమస్యలు తలెత్తుతున్నాయని, వెంటనే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయంలో ఏఈ నరేందర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పంతునాయక్, శంకర్, చెన్నయ్య, శ్రీశైలం, మోహన్, హరి, సూర్య, మల్లేశ్ తదితరులు ఉన్నారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత



దాకు భగత్ దాదా ఆలయం వద్ద శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

మాడ్గుల: దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని పీసీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని మాడ్గుల గుట్టపై దాకు భగత్ దాదా ఆలయాన్ని దర్శించికొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో స్టాలిన్, చందర్, సునీల్, పరంసింగ్, సుమన్, రెడ్యానాయక్, దూదియ్య తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఆరు గ్యారంటీలు

- సీసీ రోడ్ల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే రంగారెడ్డి



తుర్కగూడలో రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం: మండల పరిధిలోని చర్లపటేల్‌గూడ, తుర్కగూడ గ్రామాల్లో సీసీ రోడ్లను ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సోమవారం ప్రారంభించారు. చర్లపటేల్‌గూడలో రూ.27.5 లక్షలతో, తుర్కగూడలో రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం పనిచేస్తుందని ఈ సందర్భంగా ఆయన అన్నారు. ఆరు గ్యారంటీలు అర్హులందరికీ అందుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కృపేశ్, జెడ్పీటీసీ భూపతిగాళ్ల మహిపాల్, ఎంపీడీఓ వెంకటమ్మ, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు భరత్‌రెడ్డి, ఎంపీటీసీ ఆంజనేయులు, మాజీ ఉపసర్పంచ్ నరేందర్‌రెడ్డి, డీఈ శ్రీనివాస్, ప్రత్యేకాధికారులు వరప్రసాద్, ప్రణీత్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పదవులు శాశ్వతం కాదు

- సేవలే చిరకాలం గుర్తుంటాయి
- ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్



మాట్లాడుతున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

ఆమనగల్లు: పదవులు ఎవరికీ శాశ్వతం కాదని, ప్రజలకు చేసిన సేవలే చిరకాలం గుర్తుంటాయని ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఆమనగల్లులోని శ్రీలక్ష్మి గార్డెన్స్‌లో సోమవారం ఉప్పల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో కల్వకుర్తి నియోజకవర్గంలోని జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. నిరంతరం ప్రజల్లో ఉంటూ వారి సమస్యలపై పోరాడేవారిని ప్రజలు పాలకులుగా ఎన్నుకుంటారని ఆయన అన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు. గ్రూప్ 1, 2 పోస్టులను పెంచాలని ఆరు రోజులుగా నిరుద్యోగులు దీక్ష చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ ప్రజావ్యతిరేక విధానాలపై ఐక్యంగా పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్ మాట్లాడుతూ.. ట్రస్టు తరఫున ఇప్పటి వరకు రెండు వేల పక్కా ఇళ్లు నిర్మించి ఇచ్చామని, వేలాది మంది పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందజేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు దశరథ్‌నాయక్, అనురాధపత్యానాయక్, ఎంపీపీలు నిర్మల శ్రీశైలంగౌడ్, మనోహర, విజయ, వైస్ ఎంపీపీలు ఆనంద్, జైపాల్‌నాయక్, శాంతి, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు జీఎల్‌ఎన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు దశరథ్‌నాయక్, లచ్చిరాంనాయక్, బుచ్చిబాబు, కుమార్, పత్యానాయక్, జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మత్తుతో జీవితాలు నాశనం



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులతో పోలీసులు

అబ్దుల్లాపూర్‌మెట్: యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడి తమ విలువైన జీవితాలను నాశనం చేసుకుంటుందని రాష్ట్ర యాంటీ నార్కోటిక్ బ్యూరో బృంద సభ్యులు, రాచకొండ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్‌రావు, ప్రవీణ్‌కుమార్, ఎస్‌ఐ జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. సోషియో స్పైర్ వారోత్సవాల్లో భాగంగా పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ పరిధిలోని డిస్కవరీ ఓక్స్ పాఠశాలలో సోమవారం ప్రకృతి వైపరీత్యాలు, లింగవివక్షత, మాదకద్రవ్యాల వినియోగంపై విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి వారు హాజరై సూచనలు చేశారు. మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన వారు జీవితాలను నాశనం చేసుకోవడంతో పాటు తమ నియంత్రణను ఎలా కోల్పోతారో తెలిపే వీడియో ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సారా అంజుమ్, కో–ఆర్డినేటర్స్ సాగరిక, సూర్యప్రకాశ్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

వైద్య వృత్తి విలువైనది



ఆమనగల్లులో సీనియర్ డాక్టర్‌ను సత్కరిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

ఆమనగల్లు: వైద్య వృత్తి ఎంతో విలువైనదని లయన్స్‌క్లబ్ జిల్లా వివిధ విభాగాల అధ్యక్షులు నటరాజ్ యాదయ్య, చంద్రశేఖర్, రామచంద్రారెడ్డి అన్నారు. ప్రాణాన్ని నిలిపే వైద్యులు దైవ సమానులన్నారు. ఆమనగల్లు పట్టణంలో సోమవారం జాతీయ డాక్టర్స్ డే వేడుకలు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు దొంతు పుల్లయ్య, దామోదర్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, స్రవంతి, శ్రీనివాస్‌రెడ్డి, హరికాంత్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, సురేశ్‌రెడ్డి, హరీశ్‌రెడ్డి, అడపాల దివ్య, అఖిల్, కల్యాణ్‌రెడ్డి, వేణుగోపాల్, నాగరాజులను సత్కరించారు. గ్రామీణ ప్రాంతాల వారికి వైద్యులు శిబిరాల ద్వారా వైద్య సేవలు అందించాలని వారు కోరారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ పీఆర్‌ఓ ఎంఏ పాషా, అంజయ్య, రమేశ్, లింగయ్య, యాదయ్య, నర్సింహ, బాలకృష్ణ, నరేందర్‌రెడ్డి, ఓంకారం, ఎంపీహెచ్‌ఈఓ తిరుపతిరెడ్డి, ఆశ, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

లిమ్స్‌లో డాక్టర్ డే వేడుక



ఇబ్రహీంపట్నం: కేక్ కట్ చేస్తున్న వైద్యులు, ఆస్పత్రి సిబ్బంది

ఇబ్రహీంపట్నం: గ్రామీణుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా తక్కువ ఖర్చుతో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని ఇబ్రహీంపట్నంలో లిమ్స్ ఆస్పత్రి ఎండీ విశ్వనాథ్ అన్నారు. సోమవారం లైఫ్ కేర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ ఆస్పత్రి(లిమ్స్)లో వైద్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డాక్టర్ డేను పురస్కరించుకొని ఈనెల 30వ తేదీ వరకు గుండె, కిడ్నీ, లివర్, బ్రెయిన్, థైరాయిడ్ తదితర పరీక్షలను తక్కువ ధరకు చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వైద్యులు సహదేవరెడ్డి, రాంరాజ్, దినేశ్, ఆనంద్, మేనేజర్ బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాలయాలకు భూమి కేటాయించాలి

తలకొండపల్లి: స్థానికంగా విద్యాలయాలకు భవనాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని బీజేవైఎం కల్వకుర్తి అసెంబ్లీ కన్వీనర్ అనిల్ అన్నారు. ప్రభుత్వాలు మారుతున్న విద్యార్థుల సమస్యలు పరిష్కారం కావడం లేదని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలో సరియైన భవనం లేక ఇక్కడ మంజూరైన మహాత్మా జ్యోతిరావు పూలె గురుకుల విద్యాలయాన్ని మహేశ్వరానికి తరలించారని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో ఉన్న ప్రభుత్వ భూమిని విద్యాలయాల ఏర్పాటు కేటాయించాలని అధికారులను కోరారు.

నేడు సర్వసభ్య సమావేశం

మాడ్గుల: మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాల్లో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ పద్మారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి తదితరులు హాజరవుతున్నట్లు ఆమె వివరించారు. సకాలంలో ఎంపీటీలు, అధికారులు హాజరుకావాలని కోరారు.